

# గొల్లమ్మ బావి

**మునులు,** దేవతలు ఆగ్రహం చెందినప్పుడు శపిస్తారని పురాణాల్లో చెబుతారు. అది వారి తపశ్శక్తికి నిదర్శనం. కాని ఒక సామాన్యవ్యక్తి, నిరుపేద, కాయకష్టం చేసుకొనే జీవి తన కన్యాయం జరిగిందనే ఆవేశంలో పలికిన పలుకులు శాపంగా పరిణమించాయంటే నమ్మలేమేమో! కాని అలా జరిగిందని విన్నప్పుడు మాత్రం నేను నిజంగానే మ్రాన్పడిపోయాను.

శివరామపురం చెరువు మరమ్మతుకు ఎస్టిమేట్లు తయారు చేయమని ప్రభుత్వం నియోగించగా మొదటిసారిగా నేను ఆ ఊరు వెళ్ళాను. సమయానికి కరణం, మునసబులు గైరుహాజరు కావడంతో ప్రస్తుత కరణం తండ్రి భూపతిగార్ని

నావెంట రావడానికి, చెరువు ప్రదేశం చూపి నా ఎస్టిమేటుకు కావలసిన విషయసేకరణకు తోడ్పడ డానికి అంగీకరించారు. ఆయన దాదాపు 80 ఏళ్ల వ్యక్తి. వృద్ధాప్యం సహజంగా తెచ్చే స్వరంలో వణుకు, మాట తడబాటు, మధ్యమధ్య ఖంగుమనే దగ్గు ఆయనకు అనుచరులు కాగా, తన ఆసరాగా చేతికర్రను మెల్లిగా నేలమీద తాటించుతూ ఊరి వెలుపలికి నన్ను అనుస రించాడు ఆయన.

"అదిగో, చూడండి! ఆ కనపడే గుబురుచెట్ల ప్రదేశం ఈ ఊరికి శిరస్సులాంటిది. దానికి వెనకాలే చెరువు" అని చూపెట్టారు భూపతి గారు, ఊరు వెలుపలికి వచ్చిన తర్వాత.

ఊరికి సుమారు మైలు దూరంలో ఉంది ఆ ప్రదేశం. సాయంసమయపు నీరెండలో రెండు ఎత్తయిన కొండలు, ఒకదానికొకటి రెండు ఫర్లాంగుల దూరంలో మేరు పర్వతాల్లా నిలిచి ఉన్నాయి. వాటి రెంటిమధ్య చెట్లు గుబుర్లు గుబుర్లుగా పెరిగి ఉన్నాయి. ఊరికీ, కొండ లకూ మధ్యగా మెట్టపొలాలు. గులకరాళ్ళతో నిండి ఉన్న పొలాలను చూసుకొంటూ నడు స్తున్నాము.

"నీపేరేమిటి బాబూ?" భూపతిగారు ప్రశ్నిం చారు. చెప్పాను.

"చెరువు బాగు చేయించమని ఎవరైనా అర్జీ పెట్టుకున్నారా నాయనా, మా ఊరు నుంచి?"

"లేదండీ, ప్రభుత్వమే పూనుకున్నది. ఈ ఊరి చెరువు చాల పెద్దదని, దాన్ని బాగు చేయిస్తే కొన్ని వందల ఎకరాల భూమి సస్య క్షేత్రాలుగా మారుతుందని లోగడ సర్వే చేయించేటప్పుడు ఒక హెడ్ సర్వేయరు ప్రభు త్వానికి తెలియజేశాడు."

"శుద్ధ తెలివి తక్కువ." ఆయన ఖంగుమని దగ్గుతూ తనలో తను అనుకున్నట్లు మెల్లిగా అన్నాడు.

"అదేమిటండీ, అలా అంటారు?"

"అవును బాబూ! ఇదంతా వృథా ప్రయాస. ప్రయోజనం లేనిపని. బాగు చేయించటానికి ఈ చెరువు ఏం చెడిపోయిందని? నిక్షేపంలా ఉంది. కాని నీరే ఉండదు. అది శాపం."

"శాపమా!" ఆగిపోయాను నేను.

"ఆశ్చర్య పడవలసిన దేమీలేదు బాబూ." దగ్గటం వల్ల వచ్చిన ఆయాసంతో అన్నాడాయన. "అంతా చెబుతాను, రా" అంటు ముందుకు నడిచాడు.

కొద్ది క్షణాల్లో ఆ ప్రాంతం చేరుకున్నాం. ప్రకృతి పాలనలో విచ్చలవిడిగా పెరిగిన పచ్చ దనాలు ఒకవేపు, మానవుని సమాదరణలో నియ మిత రీతుల్లో పెరిగే ఆకుతోటలు మరోవేపు, మధ్యగా శివాలయం, ఆ తర్వాత చెరువుకట్ట, కొండలు—కన్నుల పండుగలా ఉంది ఆ ప్రదేశం. మొట్టమొదటగా తమలపాకు తోటలు తగిలాయి

**నమ్మక చెడతావు సుమా అని హెచ్చరిస్తారు. నమ్మిక ఉంచేనే మోసానికి గురికావడం జరుగుతుంది. చెడడం అంటూ ఎలాగూ సాధ్యం — అంతమట్టుకు చెప్పవచ్చు. కాని నమ్మిక లేకపోవడం కన్న ఉండడం మేలు. అది మానవత్వానికి దోహదమిస్తుంది.**

మాకు. పది పన్నెండడుగుల ఎత్తు పెరిగిన అవిసెచెట్లకు పెనవేసుకొని ప్రాకిన ఆకుతీగలు పచపచలాడే లేత ఆకులు సూర్యకిరణాల్లో ప్రతి ఫలించి పసిడి రంగులను వెదజల్లుతున్నాయి. ఆకు తోటలచుట్టూ దిట్టమైన కంచె పరిరక్షి స్తున్నది. తోటలకు నీరు పెడుతున్న పాలికాపు భూపతిగారిని అల్లంత దూరంలోనే చూచి, చేతిలోని పారను అవతలపారవేసి, తలపాగను విప్పి చంకలో నుంచుకొని "దణ్ణాలు బాబుగారూ!" అని చేతులు కట్టుక నిలుచున్నాడు. అతనివేపు ఒకసారి చూచాను. భారతదేశపు పల్లెపట్టుల అడుగడుగునా ప్రతిఫలించే విశ్వాంత, నిరాడంబ రత, నైర్మల్యం, అమాయకత, విధేయత ఉట్టిపడుతూ నావేపు అదోలా చూచి నవ్వు తున్నాడు. నేను నా చూపులను మరల్చుకొని, అచటి ప్రకృతిని తిలకించాలని దిక్కులు కలయ జూస్తున్నాను. ఆకు తోటలకు ఎడమవేపుగా ఒక చిన్న మామిడితోపు, దాని కటువేపుగా చింతల తోపు ఉన్నాయి. మామిడితోపుకు ఇవతలి వేపుగా ఒక చిన్న దేవాలయం, దేవాలయ ప్రాంగ ణంలో ఒక మర్రిచెట్టు. చెట్టుపైన పక్షులు చేస్తూన్న వింత ధ్వనులు కొంచెం దూరంగా ఉన్న మాకు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి. దగ్గరగా వెళ్ళి దేవాలయాన్ని, ఆ పరిసర ప్రాంతాలను పరిశీలించాలని ముందుకు అడుగువేశాను.

"ఎవరు బాబుగారూ వీరు?"

పాలేరు అడిగిన ప్రశ్నకు భూపతిగారు సమా ధానం చెప్పారు.

"వీరు మన ప్రభుత్వోద్యోగి. చెరువు బాగు చేయించడానికి ఎంత అవుతుందో అంచనా వేద్దా మని వచ్చారు." ప్రతిమాటను నొక్కి పలుకు తున్న ఆయన స్వరంలో ఏదో ఒక విధమైన నిర్లక్ష్యం, అపహాస్యం గోచరించాయి నాకు.

"ఏముంది బాబు చెరువును బాగు చేయించ డానికి? అందులో నీరు నిలవకపోవటం శాపం వల్లనే గదూ!" పాలేరు మాటలకు సమాధానం నేనుగాని, భూపతిగారు గాని చెప్పకుండానే ముందుకు నడిచాము.

కొద్ది దూరంలో ఒక చిన్న నీటి కాలువ. దాని నిండుగా ప్రవహించే నీరు నన్నాకర్షించాయి. బావినుంచి తోడిన నీరులా స్వచ్ఛంగా నిర్మలంగా ఉంది నీరు. చెప్పులజోడు విప్పి కాలువలో కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కుని, దోసిలితో కాసిని నీటిని పుక్కిటపట్టి, "ఆహా! కొబ్బరి నీళ్ళలా ఉన్నవండీ" అన్నాను. కాలువగట్టుపై నున్న భూపతిగారు గర్వంగా నవ్వారు.

"ఈ నీరు రుచిచూచి ఆ మాట అననివారు లేరు" అంటూ దేవాలయం వైపు దారితీశారు ఆయన.

దేవాలయం వెనకాల చింతలు, వాటిమధ్యలో నుండి చెరువుకట్ట కనపడుతున్నాయి. చెరువులో నీరు నిలవదని, శాపమని చెప్పారే మరి ఈ నీ రెక్కడిది అనే ఆలోచన వెంటనే కలిగింది నాకు. అదే అడిగాను భూపతిగారిని. ఆయన ఈవిధంగా చెప్పారు:

"ఎవరి శాపం వల్లనైతే ఈ చెరువు నిరర్థ కమైనదో, ఆ మహామహుడి నోటి చలువవల్లనే చెరువుకట్ట క్రింద ఒక నేల నుయ్యి వెలిసింది. దానిలోని నీరు అమృతసమానం. కుండపోత వర్షాలకు గూడ చెరువులో నీరు నిలువదు. అలాగే నిప్పులు చెరిగే వేసవికాలంలోగూడ ఈ బావి లోని నీరు తరుగదు సరికదా, ఈవిధంగా కాలువ నిండుగా ప్రవహించడం మానదు. ఈనీరు బావి నుంచి మోటద్వారాగాని, పంపుద్వారాగాని తోడి పోసినదిగాదు. మహాత్ముల మనసులోని ప్రేమా మృతంలాగా స్వతహాగా ఉపరితలానికి ఉబికి అనందవాహినిగా ప్రవహిస్తుంది. ఈ నీరే ఈ ఆకు తోటలకు జీవం. ఆకుతోటలే కొన్ని కుటుంబాలకు జీవనాధారం. ఇంకొంచెం నడవండి ఆ నూతిని చూద్దురుగాని."

నేల బారుగా ఉన్న నూయి అది. సుమారు యాభై చదరపు గజాల విస్తీర్ణం ఉన్న ఆ నూతికి అటువేపుగా ఎత్తైన చెరువుకట్ట, ఇటువేపు దేవాలయం. అక్కడక్కడా నీటిపైన పచ్చని పాచి తేలియాడుతున్నది. చిన్న కోనేరుగా ఉన్న ఆ బావిలోనుంచి అంతటి జలధార ఎలా వస్తు న్నదా అని ఆశ్చర్యం వేసింది.

"దేవదర్శనం చేసుకుందాం రా బాబూ" అంటూ ఆలయంలోకి దారితీశా రాయన.

పూర్తిగా శిథిలావస్థలో ఉన్న దేవాలయం ప్రహరీగోడలు శతాధిక వర్షాలప్రాయాన్ని తెలుపుతున్నాయి. గాలికి అల్లనల్లన ఊగుతూ గలగలమని చిరుగంటల నాదాన్ని వినిపిస్తున్న ధ్వజస్తంభం, జీవకళ ఉట్టిపడుతూ, దాదాపు నాలుగడుగుల ఎత్తున్న నందీశ్వరుని విగ్రహం, గుడికి కుడిచేతి ప్రక్కగా పెద్ద రావిచెట్టు, దేవాలయం మీదికి వంగి, శివునికి అచ్ఛాదన కల్పిస్తున్నట్లున్న ఆ రావిచెట్టు శాఖ — ఆ దేవా

**'శాలివాహన'**

లయపు టౌన్నత్యాన్ని చెప్పక చెబుతున్నాయి.

పూజారి గుడి తలుపులు తెరిచాడు. కన్నులు మిరుమిట్లు గొలిపే శివలింగం, నాలుగడుగుల ఎత్తు, రెండడుగుల పరిధి. విభూతి పట్టెలు తీర్చి దిద్దివున్న ఆ మహాలింగంపై సన్నని జల ధార పడుతుంటే శివసాక్షాత్కారం పొందానా అన్న భావన కలిగి, అప్రయత్నంగా కేలుమోడ్చి నమస్కరించాను.

"పూర్వం అగస్త్యముని కాశీనుంచి రామేశ్వరం వెళ్ళుతూ దారిలో మూడు తావుల శివలింగాలను ప్రతిష్ఠించాడు. ఒకటి అమరావతిలో, రెండవది ఇక్కడ, మూడవది ఇక్కడికి దక్షిణంగా ఆమడ దూరంలో ఉన్న మరొక గ్రామంలో. అగస్త్య మునిచే ప్రతిష్ఠింపబడడంవల్ల ఈయనను అగస్త్యేశ్వర స్వామి అంటారు. ఇక్కడ ఈ ఆది శివుని దర్శించి పూజించి, తామనుకున్న కోర్కెలు సిద్ధించి, తమ మొక్కుబడులు తీర్చుకోడానికి పదేపదే వస్తుంటారు ప్రజలు.' ప్రతి కార్తీక మాసంలోను నిత్యాభిషేకం, శివరాత్రికి గొప్ప ఉత్సవం ఇక్కడ జరగడం పరిపాటి" అన్నారు భూపతిగారు.

"మీరు చెప్పేవన్నీ వింటుంటే నాకేదో కథ వింటున్నట్లుగా ఉన్నదండి" అన్నాను నవ్వుతూ.

భూపతిగారు మెల్లిగా నవ్వారు. "అసలు కథ చెబుతాను చెరువుకట్టపైకి నడవండి."

ఆయన నడవమన్నవేపు నడవడం, ఆయన చెప్పింది వినడం— మంత్రబద్ధులలా అయాము.

దాదాపు ఇరవై, ఇరవై అయిదు అడుగుల ఎత్తుగల దిట్టమైన కట్ట అది. ఇరువేపులా ఉన్న కొండలను కలుపుతూ కట్టబడిన ఆకట్ట రెండు ఫర్లాంగుల పొడవు ఉంటుంది. దాన్ని కట్టడంలో సిమెంటుగాని, సున్నంగాని కనీసం ఒక రాయిగాని వాడినట్లు ఎక్కడా కన్పడదు. సన్నని గులక కలిసి ఉన్న ఎర్రగరపమట్టితో కట్టబడింది కట్ట. అయినా అమిత దృఢంగా ఉంది. అక్కడికి పది పన్నెండు మైళ్ళ దూరాన మరికొన్ని కొండలు. చుట్టూ ఉన్న కొండ చరియలనుంచి చెరువులోనికి నీరు వచ్చే వీలుంది. నాలుగైదు మైళ్ళ రిజర్వాయరు తయారు కావచ్చు. భూపతిగారు చెప్పినట్లు చెరువు కట్టను బాగు చేయవలసిన అవసరమేమీ కాన రాదు. కాని నీరు నిలవడం లేదంటే ఆశ్చర్యం గానే ఉంది. దీనికి ఏదో కారణం ఉండి ఉంటుంది. దాన్ని కనిపెట్టాలి — అనుకున్నాను.

"శాపమేమిటని అడిగారు కదూ. ఇలా కూర్చుందాం రండి చెప్తాను...." అని ప్రారంభించారు భూపతిగారు.

సూర్యుడు అస్తమించడానికి ఒక గంట వ్యవధి ఉంది. కొండలపైనుంచి మేకలు, ఆవులు ఆహారసేకరణ మాని క్రిందికి దిగుతున్నాయి. ఆ చెరువు కట్టపై ఒకచోట కూర్చున్నారు భూపతిగారు. నేను తీసుకోవలసిన కొల

# గొల్లమ్మ బావి

తలు, చూడవలసిన ప్రదేశాలు, కనిపెట్టవలసిన కారణాలు అన్నీ మరచి ఆయన కెదురుగా కూర్చున్నాను.

"దాదాపు అరవై సంవత్సరాలకు పూర్వం ఇక్కడ ఈ తోటలు గాని, చెరువుగాని, నుయ్యి గాని ఏవీ ఉండేవి కావు. ఈ ఒక్క శివాలయం మాత్రం ఉండేది. శివాలయం ప్రక్కగా ఈ రెండు కొండల మధ్యనుంచి చిన్న వాగు ఒకటి ఉండేది. దానిలో వర్షాకాలం రెండు నెలలు నీరుండేది. అప్పుడు మాత్రం ఆ ఏరు చాల ఉధృతంగా పొంగి సమీపంలోని పొలాలకు తీరని నష్టం కల్గించేది. మిగతా ఋతువులలో అసలు నీరే ఉండేది కాదు. ఈ చుట్టుప్రక్కల ఎక్కడా కూడా నీరు లభ్యమయ్యేదిగాదు. శివాలయం ఉన్నచోట నీరు లభ్యం కాకపోవటం ఆశ్చర్యం గాను, శివార్చనకు కష్టంగాను ఉన్నా, గ్రామం నుంచి నీరు మోసుకువచ్చి శివార్చన జరుపబడు తుండేది."

భూపతిగారు మధ్య మధ్య దగ్గుకోడానికి, ఆయాసం తీర్చుకోడానికి, ఆగుతూ చెప్పుకు పోతున్నాడు.

"వెంకటగిరి సంస్థానం తెలునుగదా?" ఆయన ప్రశ్నించారు.

"తెలియకపోవడ మేమిటండీ? మొన్నమొన్నటి వరకు ఆ సంస్థానంలోనివేగా ఈ ప్రాంతాలన్నీ. ఈ పొలాలమీది శిస్తు ఆ రాజాగారికేగా చెందేది" అని జవాబిచ్చాను.

"అవును. వారిది పెద్ద సంస్థానం. ఆ సంస్థానంలో దివానుగా పనిచేసి పించను పుచ్చుకుంటున్న ఒక వ్యక్తి ఆరోజుల్లో ఈ ఊరికి పెద్ద. ఊరిలో ఆయన మాట వేదాక్షరం. ఆయన్నందరూ దివాన్‌గారు అని పిల్చేవారు, ఆయన దివాన్‌గిరి నుండి రిటైరైనా. ఆయన



యుగళ నృత్యం

చిత్రం—కె. రంగారావు (రాజమండ్రి)

ఒకసారి ఈ ప్రాంతానికి వచ్చి ఇచటి నీటి కొరతను తీర్చటానికి మార్గమేదైనా వెతకాలని నిశ్చయించుకున్నాడు...."

"ఆ తర్వాత ఈ బావిని త్రవ్వించారు కదూ?" అన్నాను ఉండబట్టలేక.

"కాదు, నీటికొరత తీరడానికి, వర్షాకాలంలో ఈ రెండు కొండల మధ్యగా పారే చిన్న ఏరు పంటపొలాలను పాడుచేయకుండా ఉండడానికి, దానితోపాటు ఈ భూములన్నీ మాగాణిభూములుగా మారడానికి ఒక పెద్ద పథకం తయారు చేశారాయన. ఆ పథకాన్ని అమలు జరపడానికి, సంస్థానాధీశ్వరుల వద్దనుంచి అనుమతికూడా పొందారు....."

"ఆతర్వాత.....?"

"వెంటనే పనివారిని పిలిపించారు. ఈ రెండు కొండలను కలుపుతూ ఒక పెద్ద కట్ట కట్టించితే, వర్షాకాలంలో పొర్లిపొంగే ఆ ఏరు పంటలను పాడుచేయక పోవటమేగాక చక్కటి చెరువు వసతి ఏర్పడుతుందని, దానిక్రింద ఎన్నో మెట్ట పొలాలు, ఉషరక్షేత్రాలు సస్యక్షేత్రాలుగా మారు తాయని తన అభిప్రాయాన్ని, చేయవలసిన పనిని పనివారలకు తెలియజేశారు దివాన్‌గారు.

"ఆ పనివారలకు పెద్ద వెంకటాద్రి. ఇలాంటి పనులలో ఆరితేరిన చేయి. ఏడుమూర్ల పంచ తలపాగా చుట్టి, చేతిలో గజం బద్దలా ఉపయోగించే వెదురుకర్రతో, నొసట ఇంత వెడల్పు చుక్కబొట్టుతో — నిగనిగలాడే నిండైన విగ్రహం వెంకటాద్రి. తెల్లబారుతున్న అతని బుర్రమీసాలు అతనిక్రింద పనిచేసేవారికి హడలు పుట్టిస్తాయి. అతడు ఒక్కసారి ఈ ప్రదేశాన్నంతటినీ చూచి వినయం ఉట్టిపడుతున్న స్వరంతో దివాన్‌గారికి నివేదించుకున్నాడు.

'పెథువులు పెద్ద పనిపెట్టింద్రు. మరి ద్రవ్యం మాట సెలవిప్పించండి.'

'వెంకటాద్రీ! నేను చెప్పిన విధంగా పని పూర్తి చేయాలి. ఏమి కావాలో నీవే కోరుకో.'

"దివాన్‌గారు కోరమనగానే ఒక్క నిమిషం ఆలోచించి 'ఒక తూమెడు రూక లిప్పించండి' అన్నాడు వెంకటాద్రి."

భూపతిగారు ఆగారు.

'తూమెడు రూకలా?' అన్నాను.

"తూమెడు రూకలంటే ఆశ్చర్యంగా ఉంది కదూ! ఆరోజుల్లో ఇప్పటిలా కరెన్సీనోట్లు లేవు. అన్నీ వెండి రూపాయలు. మనం నేడు ధాన్యం కొలిచినట్లు ఆనాడు పెద్ద మొత్తాల రూకల్ని కొలపాత్రలతో కొల్చి ఇచ్చేవారు. తూము అంటే ఇరవై మానికలు. అంటే నలభై శేర్లు" అని వ్యాఖ్యానించారు భూపతిగారు.

"అందుకు దివాన్‌గారు ఒప్పుకున్నారా?" కుతూహలంగా ప్రశ్నించాను. ఆయన చిన్నగా నవ్వి ఒక నిట్టూర్పు పుచ్చాడు.

"అవును. దివాన్‌గారు ఒప్పుకోలేదు. కాని

అంతకు తక్కువైతే పనిచేయమని భీష్మించాడు వెంకటాద్రి. దివాన్‌గారికి ఏమీ తోచిందికాదు. తూమెడు రూకలంటే సామాన్యమా మరి. అదీ, ఆరోజుల్లో. వెంకటాద్రి కాకుండా మరొక్క బిట్టువారి కెవరికైనా పనిని ఒప్పగించాలని ఆలోచించాడు కూడా దివాన్‌గారు. కాని, వెంకటాద్రి పనితనం, అతని నిజాయితీ తనకు బాగా తెలిసినందువల్ల ఈ పనిని ఏవిధంగానైనా వెంకటాద్రికే అప్పగించాలని ఆయన నిశ్చయించుకున్నాడు.

"దివాన్‌గారి కుమారుడుగూడ — అతను అప్పటికి ఇరవై సంవత్సరాల ప్రాయం కలవాడు — వెంకటాద్రి న్యాయంగానే అడిగాడని అందుకు సమ్మతించి, పని మొదలుపెట్టమని చెప్పమని దివాన్‌గారిని బలవంతం చేశాడు.

"ఆ రోజు సంవత్సరాది పండుగ. ఉదయం పది గంటలవేళ. మిటమిటలాడే మాటి కిరణాలతో సూర్యభగవానుడు మింట వెలిగిపోతున్నాడు. ఊరి జనమంతా శివాలయ ప్రాంతంలో చేరారు. భక్తిపారవశ్యంతో ఆదిశివుని ముందు సాష్టాంగపడి, శివసాన్నిధ్యంలోని విభూతిని మూడు పట్టెలుగా నుదుట కీలించి, కనుబొమల కలయికలో కుంకుమను తీర్చిదిద్ది, ప్రక్కనే ఉన్న పలుగును పారను తీసుకొని 'శంభో! హరా! శంకరా!' అంటూ కట్ట పనిని ఉపక్రమించడానికి ముందుకు నడిచాడు వెంకటాద్రి. అతని కుమారులు, అడంగులు, మిగతా పాటకజనం పలుగులతో, పారలతో వెత్తిన వెదురుబుట్టలతో అతన్ని అనుసరించారు.

"అదుగో చూడు, ఆ తుమ్మచెట్టువద్ద చిన్న పుట్ట ఉన్నది కన్పడుతున్నదా?" అని అడిగారు. చెరువులోకి చూస్తూ అవునన్నాను.

"అచటనే మొట్టమొదటిసారిగా పలుగును వేశాడు వెంకటాద్రి. వెదురుబుట్టలోకి రెండు పారల మట్టి తీశాడో లేదో నిగనిగలాడే నాగేంద్రుడు బుస్సు మంటూ పైకి వచ్చాడు. అక్కడ ఉన్నవారంతా నిస్తుపోయారు. అక్కడే ఉన్న వెంకటాద్రి కుమారుడు గంగులు తండ్రి వీపుమీద చేయివేసి 'అయ్యా, ఈ పని మనకు జయం కల్గించేదిగా కన్పట్టంలేదు. పొద్దుటేల మంచి నా ఎడమ కన్ను అదురుతూ ఏదో కీడు గలుగబోద్దని జోస్యం చెప్తుండాది. ఇప్పుడీ నాగేంద్రు డీ విషయాన్ని రూఢిచేశాడు' అన్నాడు.

"వెంకటాద్రి కొడుకు చేతిని వదిలించుకుంటూ గంభీరంగా అన్నాడు.

'పిచ్చలేద్రూటా నీకు! పెద్దలవద్ద పని ఒప్పుకున్నప్పుడు మర్యాదగా పూర్తిచేసి మన్నన అందాలిగాని ఏవో అవాంతరాలు వస్తవని జంకి పనిని మానాలా? నేను బ్రతికుండగా చేయలేనాని. ఈ నాగేంద్రుడ్ని చూసి భయపడుతున్నావేమో! ఈయన మనల్ని దీవించటానికి వచ్చాడురా! కదూ నాగేంద్రా! మమ్మల్ని దీవించు తండ్రీ!' అంటూ ఆ నాగసర్పానికి తలవంచి నమస్కరించాడు. అందరూ నమస్కరించి మ్రొక్కుకున్నారు. నాగేంద్రుడు విప్పిన పడగను ముడుచుకొని ఎటో వెళ్ళిపోయాడు. అందరికీ ఆశ్చర్యం, ఆనందం ముంచుకరాగా భక్తిపారవశ్యంతో 'హర హర మహాదేవ! శంభో శంకర!!' అంటూ పని మొదలుపెట్టారు.

"ఒక గంట గడిచింది. రాను రాను ఎండ తీవ్రమౌతున్నది. కష్టించిన శరీరాలనుంచి ఘర్మజలం కాలువలు కడుతున్నది. నాలుక పిడుచకట్టుకపోతున్నది. ఇక అనాటికే పని చాలిద్దామనుకున్నారంతా.

'అమ్మో! దాహం. నీళ్లబుంగ ఎక్కడ?' అన్నాడు వెంకటాద్రి రోజుకుంటూ.

'ఇదిగో తమ్ముడూ దాహం' అంటూ ముంతనిండుగా చల్లనందించింది ఒక వృద్ధ వనిత.

'నాగమ్మక్కా! నీవా! ఇంత ఎండలో వచ్చావా?' అన్నాడు వెంకటాద్రి చల్ల నందుకుంటూ.

'అవును నాయనా! నీ అల్లుడు మేకల్ని మేపడానికి ఈ కొండలకు వస్తుంటాడుగా. ఎండవేళప్పుడు వాడికోసం దాహం పట్టుక వస్తాను రోజూ. ఇవాళ మీరంతా ఇంత మంచి పనిని మొదలుపెడుతున్నారని విని, ఉన్న చల్లలో ఇంకా యిన్ని నీళ్లు కలిపి మరి కాసినిగాచేసి పట్టుకొచ్చాను. రండి బాబూ, తలా కొంచెం తాగి సేద తీర్చుకోండి' అన్నది.

"ఆవిడ ఒక గొల్లమనిషి. ఎవరైతేనేం, అమృతమూర్తి. ఆ మండుటెండలో అంత శ్రమ చేసినమీదట వచ్చి మంచినీటితో దాహం తీర్చుకుందా మనుకున్న ఆ శ్రామికులకు అయాచితంగా, ఆప్యాయంగా ఆ వృద్ధవనిత పంచిపెట్టే మేకచల్ల అమృత సమానమై ఆనందించారు. వారి అల్ప సంతోషానికి కన్నుల నీరు తిరిగేటట్లు ఉబ్బి తబ్బిబ్బై, అప్పటినుంచి వారా పనిని చేస్తున్నంతకాలం ఏదో ఒక సమయంలో ప్రతిరోజు వారందరికీ చల్లను పంచిపెట్టేది నాగమ్మక్క.

"ఆ మర్నాడేమిజరిగిందో తెలుసా? వెంకటాద్రికి గొప్ప విపత్తు సంభవించింది. చెట్టంత పెరిగిన అతని చిన్న కొడుకు ఉన్నట్టుండి నెత్తురుకక్కి చనిపోయాడు. పుత్రవియోగం వెంకటాద్రిని బాగా క్రుంగదీసింది. ఆ రోజల్లా నిశ్చేష్టుడై మాటా మంతీ లేకుండా, మూగవాడైపోయాడు. ఊరిలోనివారంతా తోచిన విధంగా ఓదార్చారు. కొంతమంది గుస గుసలాడారు, చెవులు కొరుక్కున్నారు.

"వెంకటాద్రి పెద్ద కొడుకు గంగులు తండ్రివద్దకు వచ్చాడు. గ్రుడ్ల నీరు క్రుక్కుకుంటున్న తండ్రిని చూచి అన్నాడు:

'అయ్యా! నిన్న నేను ఎంతచెప్పినా వినలేదు. నిన్న పని మొదలెట్టేముందు ఎన్ని అపశకునాలు



బుచ్చుకాలము'
చిత్రం—ఎ. ఎస్. ప్రకాశరావు (అనకాపల్లి)

కలిగాయి! నాకప్పుడే అనిపించింది ఈ పని మనకు జయంగా ఉండదని. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఇంక మనమూ పనిని గురించి మర్చిపోదాం.'

'గంగులూ!' వెర్రిగా అరిచాడు వెంకటాద్రి. భీకరమైన అతని ముఖం చూచి గంగులు అదిరిపోయాడు. 'ఎవరు ఏమైనా సరే నేను చెరువుపని మానేదిలేదు. ఒప్పుకున్న ప్రకారం జరిపి తీర్తాను. మీరంతా నాతో పని చెయ్యకపోయినా నేనొక్కడినే పని పూర్తి చేస్తాను' అంటూ పలుగు పార తీసుకొని పశ్చిమంగా ఈ కొండలవేపు పరుగు తీశాడు. ఇంకేమి ప్రమాదం ముంచుకొస్తుందోనని లోపల జంకుగా ఉన్నా, వెంకటాద్రిపైన ఉన్న భయభక్తులకొద్దీ వారంతా అతన్ని అనుసరించారు.

"రోజులు దొర్లిపోతున్నాయి. వైశాఖపు మండుటెండలు అగ్నిజ్వాలలుగా ప్రజ్వరిల్లుతూ, కనుచూపుమేరలో ఎండమావులను సృష్టించి ఆశలు గొల్పుతున్నాయి. జరుగరానిదేదో జరుగబోతున్నదని గాబోలు ప్రకృతిగూడ స్తంభించి తన సహజ వసంతశోభను వేవోళ్ల చాటటంలేదు. ఆ మండుటెండల్లో వంచిన తల ఎత్తకుండా వెంకటాద్రి, అతని అనుయాయులు కట్టను కట్టటంలో నిమగ్నులైనారు. సూర్యోదయం మొదలు పడకొండు గంటల వరకూ పనిచేసి, అలసి, సమీపంలోని మామిడి చెట్లఛాయల్లో విశ్రమించేవారు. నాగమ్మక్క పంచిపెట్టే చల్లను చవిచూస్తూ తమ శ్రమను మరచిపోయేవారు.

"ప్రతిరోజు దివాన్‌గారు, ఆయన కుమారుడు ఈ ప్రదేశానికి వచ్చి దిన దిన వర్ధమానమౌతున్న చెరువుకట్టను చూచిపోయేవారు. నీటి తేమతో నానాటికీ బిగిసే సిమెంటు కట్టడంలా స్వేదబిందువుల రూపంలో ఆ శ్రామికుల శరీరకష్టం గరపమట్టితో కలిసి, బిగిసి ఈ చెరువు కట్టగా నిల్చింది. పని పూర్తి అయింది.

"గ్రామ ప్రజల ఆనందానికి అవధులులేవు. అచట ఉన్న పొలాలు ఎక్కువగా దివాన్‌గారివే. అయినా ఎంతోమంది వాటిని కౌలుకు తీసుకొని

# గొల్లమ్మ బావి

సాగుచేసుకుంటూ తమ కుటుంబాలను గడుపుకుంటారు. ఇంతవరకు అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు అమితంగా దెబ్బతినేవి. ఇకనుంచి తమకాబాధ తీరినట్లే. వర్షం కురిసి ఒక్కసారి చెరువునిండుగా నీరు వస్తే చాలు; ఆ సంవత్సరానికి తమ పొలాలన్నిటికీ నీటి కొరత ఉండదు. ఆ శుభగడియ ఎప్పుడు వస్తుందా అని పడమటి దిక్కున ఇంద్ర ధనుస్సుకై ఎదురుతెన్నులు చూశారు గ్రామస్థులంతా.

"ఏరువాక పూర్ణిమ రానేవచ్చింది. ఎప్పుడూ లేంది ఆ సంవత్సరం అప్పుడే కొండలపైన కారు మబ్బులు దట్టమౌతున్నాయి. గంగులతోడురాగా వెంకటాద్రి ఆరోజు దివాన్‌గారింటికి వెళ్ళాడు.

'రా వెంకటాద్రీ, రా! కూర్చో' అని ఆహ్వానించారు దివాన్‌గారు. వారి ప్రక్కనే వారి కుమారుడు నిల్చి ఉన్నాడు. క్షణంసేపు మౌనంగా కూర్చున్నాడు వెంకటాద్రి. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

'అయ్యగారూ! మీరు కోరిన విధంగా పనిని పూర్తిచేశాము. మా కష్టం మాకు దయ చేయించండి' అన్నాడు వెంకటాద్రి చేతులు కట్టుకొని.

'ఊఁ చూద్దాం.'

"దివాన్‌గారి సమాధానం విని ఆశ్చర్యపోయాడు వెంకటాద్రి. ఎన్ని ఇబ్బందులువచ్చినా, ఎన్ని కష్టాలు ఎదురైనా లెక్కచేయక పని పూర్తి చేసినందుకు మెచ్చుకొని, తనకివ్వవలసిన దానితోపాటు బహుమానంగూడ ఇచ్చి తనని సంతోషపెడతారనుకున్న వెంకటాద్రికి దివాన్‌గారి సమాధానం పిడుగుపాటులా తోచింది. అయినా వినయంగా మనవి చేసుకున్నాడు.

'ప్రభువులు కరుణించాలి. ఇన్నాళ్ళనుంచి మిమ్మల్ని ఏమీ అడగకుండా పని పూర్తిచేశాము. మీరు ఇచ్చే ద్రవ్యాన్ని అందరమూ ఒక్కసారిగా పంచుకుందామని ఇన్నాళ్ళూ ఆగాము. మా సంగతి మీకు తెలియనిదేముంది? గూడెంలో వారికందరికి తిండిగింజలు నిండుకున్నాయి.....'

"వెంకటాద్రి చెప్పటం ముగించకముందే దివాన్‌గారు అందుకొని కుమారునితో 'బాబూ! వెంకటాద్రికి ఇవ్వవలసింది ఇచ్చి పంపు' అని అన్నారు.

"కొద్దిసేపటికి దివాన్‌గారి కుమారుడు 'వెంకటాద్రీ! ఇదిగో నీ తూమెడు రూకలు' అంటూ లోపలినుంచి వచ్చాడు. అతనిచేతిలో కర్రలేని ఒక ఇనుప గొడ్డలి వుంది. దాని తూము నిండుగా ఉన్న వెండి రూపాయలు వెంకటాద్రిని వెక్కిరించాయి.

"ఇదేమిటని విస్తుపోయాడు వెంకటాద్రి. అందుకు జవాబుగా 'నీకు ఇస్తామన్నది తూమెడు రూకలేగా! ఇదిగో ఇది తూము; ఇవి రూకలు. ఆహహ!' అన్నాడు దివాన్‌గారి కుమారుడు.

'ఏమిటీ అన్యాయం బాబూ!' అని దివాన్‌గారి వేపు తిరిగాడు వెంకటాద్రి. ఆయన మాట్లాడకుండా లోపలికి నడిచాడు.

"గంగులకు గంగవెర్లెత్తినాయి. 'ఇంతమోసం చేస్తావా? నిన్నేం చేస్తానో చూడు' అంటూ దివాన్‌గారి కుమారుని చేతిలోని గొడ్డలిని ఒడిసి లాక్కొని అతనిపై కురికాడు. కాని వెంకటాద్రి అడ్డుపడ్డాడు. వెంకటాద్రి గంగులను అక్కడనుంచి తీసుకవెళ్ళాడు.

"పడమటి కొండపైని మేఘాలు ఫెళఫెళమన్నాయి. కుండపోతలాంటి వర్షం మొదలైంది. ఆ వర్షంలో భుజాన పలుగుతో చెరువువైపు నడిచాడు వెంకటాద్రి. దిక్కులన్నీ చీకట్లో కలసిపోయాయి. వెంకటాద్రి శివాలయం సమీపించాడు. నందీశ్వరుని వెనుకగా నిల్చొని తల వంచి నమస్కరించాడు ఆ సర్వేశ్వరునికి. ఒక్క మెరుపు మెరిసి ఎక్కడో ఉరిమింది.

'తమ్ముడూ' అనే పిలుపు విని ఆశ్చర్యపోయాడు వెంకటాద్రి. అప్రయత్నంగా గుడి లోపలికి నడిచాడు. 'నువ్వేనా తమ్ముడూ! చీకట్లో ఎవరో ననుకున్నాను. సమయానికి మెరుపు మెరవడంతో గుర్తుపట్టాను. నీవు గూడ వర్షంలో చిక్కుకున్నావా?' అన్నది ఆవిడ. ఆవిడ ఎవరోగాదు, నాగమ్మక్క.

'అవునక్కా. పెనుతుఫానులోనే చిక్కుకున్నాను...' అని జరిగిందంతా వివరించాడు వెంకటాద్రి.

'భగవంతుడంటూ లేడా అక్కా! నాకు అన్యాయం చేయ తలపెట్టిన ఆ దివాన్‌గారికి జయమౌతుందంటావా? ఇంత కపటనాటకమాడి, మోసం చేసి త్రవ్వించిన ఈ చెరువు ప్రయోజనం ఇస్తుందా?' అంటూ బయటికి నడిచాడు.

'ఎక్కడికి తమ్ముడూ!' అని ప్రశ్నించింది నాగమ్మక్క.

'ఈ కుచ్చిత ప్రపంచం నుంచి ఎక్కడికైనా వెళ్తాను.' వెంకటాద్రి ముందుకు నడిచాడు.

'తమ్ముడూ!' బాధగా మరలా పిలిచిందావిడ. వెంకటాద్రి ఆగాడు.

'అక్కా! నాశ్రమ నిష్ఫలమైంది. అయినా నేను సహించగలను. కాని మండుటెండల్లో ఆరిపోయే మాగొంతుకల్లో అమృతంపోసిన నీఋణం ఎలా తీర్చుకోను? నేను నీకేమీ చేయలేకపోయాను. ఇన్నాళ్ళు శ్రమపడి ఈ చెరువును నిర్మించేకంటే నీవిచ్చిన చల్లలాంటి చల్లని, తియ్యని నీటితో ఎల్లవేళలా నిండుగా ఉండే బావి ఇక్కడ త్రవ్విఉంటే ఎంత బాగుండేది! కాని.... కాని....' అంటూ ఈ చెరువు కట్టపైకి నడిచాడు. భుజాన ఉన్న పలుగును కట్టక్రిందికి విసిరి వెనుదిరిగి చెరువులోకి దిగిపోయాడు.

"తెల్లవారింది. ఊరిలోని వారంతా చెరువు వద్దకు వచ్చి చూచారు, చెరువుకు నీరు వచ్చిందేమోనని. చెరువు నిండుగా నిండినట్లు నీటి అరకన్పడ్డది. కాని చెరువులో కొంచెమైనా నీరు లేదు. చెరువు కట్టకు శివాలయానికి మధ్యగా—వెంకటాద్రి పలుగు విసిరినచోట — ఒక చిన్న మడుగులో నీరునిలిచి ఉదయసూర్యుని బంగారు కిరణాలను ప్రతిఫలించింది. నాటికి నేటికి ఆ మడుగు ఎండలేదు. నాటికి నేటికి ఈ చెరువులో నీరు నిల్వలేదు. వెంకటాద్రి అతని సనివారల శ్రమకు చిహ్నంగా ఈ కట్టమాత్రం దృఢంగా నేటికీ నిలబడి ఈ విషదగాథను వినిపిస్తున్నది. ఆ గొల్లమ్మ నాగమ్మక్క పేరు మీదుగా ఈ బావి గొల్లమ్మబావి అని పిలువబడుతూ ఉంది. ఈ బావిలోని నీరే ఇచటి శివుని అభిషేకానికి, ఆకు తోటలకు ఆధారమైంది" అంటూ భూపతిగారు ముగించారు.

చీకటిపడ్డది. ఏదో చేద్దామని, ఏమేమో సేకరిద్దామని వచ్చిన నేను ఏమీ చేయకుండానే భూపతిగారు చెప్పిన కథలోని విషయాలను నెమరువేసుకుంటూ ఆయనవెంట ఊరివైపు నడిచాను. దారిలో ఒకచోట ఆయన ఆగి,

"ఈకథ ఈప్రాంతాల్లో చాలమందికి తెలుసు. దివాన్‌గారు వెంకటాద్రిని మోసం చేశాడని ఆయన్ని అందరూ నిందించారు; కాని ఇందులో దివాన్‌గారిదే తప్పంతా కాదని, వారి కుమారుని దురాలోచన వల్ల దుర్బోధనవల్ల వారు అలా మారిపోయారని తెలిస్తే.... ఏమనేవారో! ఆ దివాన్‌గారి కుమారుడు నేనేనని తెలిస్తే ఏమంటావు?" అన్నారు మెల్లిగా. నేను స్తంభించిపోయాను. ★

చిత్రం—పట్టమరాజు గిరినాథరావు (పొలికి)

